సాక్షి
ప్రకాశం
బుధవారం । 29 । మే । 2024



ర్యాష్ రేసింగ్

పెద్దదోర్నాల–శ్రీశైలం రహదారి బైక్ రేస్‌లకు నిలయంగా మారింది. రాత్రి 9 గంటలు దాటగానే కనీసం లైసెన్స్‌లు కూడా లేని మైనర్లు బైక్‌లతో రోడ్డెక్కుతున్నారు. - 8లో..



కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

స్థానిక రైజ్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను, ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ దినేష్ కుమార్ పరిశీలించారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.6/31

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం ఉక్కపోత అధికం. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అందిన 1718 సర్వీసు ఓట్లు

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సర్వీసు ఓట్లకు సంబంధించి మంగళవారం నాటికి జిల్లాకు 1718 ఓట్లు రిజిస్టర్ పోస్టు ద్వారా చేరాయి. పోస్టల్ బ్యాలెట్ పార్లమెంట్ ప్రత్యేక అధికారి ఝాన్సీ మంగళవారం పోస్టు ద్వారా వచ్చిన సర్వీసు ఓట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బాక్సులో వేసి భద్రపరిచారు. జిల్లాలో మొత్తం 6693 సర్వీసు ఓట్లు ఉన్నాయి. దీనిలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, రాజశేఖర్, శ్రీకాంత్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై పూర్తి అవగాహన అవసరం

- వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలు

ఒంగోలు టౌన్: జిల్లాలోని వైద్య సిబ్బంది క్యాన్సర్ వ్యాధిపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు అన్నారు. మెడికల్ కళాశాలలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ గైనకాలజిస్టులు, డెంటిస్టులకు మూడు రోజుల క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత అలవాట్లతో అనేక మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని చెప్పారు. క్యాన్సర్ వ్యాధిని కట్టడి చేసే లక్ష్యంతో ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రపంచ స్థాయిలో జరుగుతున్న ప్రయోగాలు, వాటి ఫలితాలను వైద్యులు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్య సిబ్బంది పూర్తిగా శిక్షణ పొందేలా తగిన చర్యలు తీసుకుంటామని, కింది స్థాయి సిబ్బందిని కూడా ఇందులో పాల్గొనేలా చూస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. జిల్లాలో క్యాన్సర్‌కు సంబంధించిన సమాచారం ఇప్పటి వరకు లేదని, ఈ స్క్రీనింగ్‌తో పూర్తి డేటా లభ్యమౌతుందని చెప్పారు. దీని వల్ల అనేక పరిశోధనలకు ఉపయోగపడుతుందని వైద్య విధాన పరిషత్ కో ఆర్డినేటర్ డాక్టర్ మూర్తి అన్నారు. వైద్యులు క్యాన్సర్ వ్యాధికి సంబంధించి ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలని జీజీహెచ్ సూపరెండెంట్ డాక్టర్ దుర్గాదేవి సూచించారు. ఓరల్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, సెర్వికల్ క్యాన్సర్ ఉన్న వారిని ప్రథమ దశలోనే గుర్తించేందుకు ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు కృషి చేయాలన్నారు. సకాలంలో గుర్తించిన రోగులను అంకాలజీ విభాగానికి రెఫర్ చేస్తే తగిన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య చికిత్స చేయడం ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథి, డాక్టర్ తిరుమలరావు, డెంటల్ హెచ్‌ఓడీ డాక్టర్ కిరణ్, అంకాలజిస్ట్ డాక్టర్ కిషన్ పాల్గొన్నారు.

నీటి నిల్వల్లో ఆయిల్‌బాల్స్ వేయాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: సీజనల్ వ్యాధులతో పాటుగా డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాధులు ప్రబలకుండా నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ కుమార్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో మంగళవారం సబ్ యూనిట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా కేసులకు ఏఎల్‌ఓ, ఐఎస్‌ఎస్ ఫాగింగ్ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఆయా ప్రాంతాలలోని పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకొని పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడేగా నిర్వహించాలని, ప్రతి సోమ, మంగళవారాలు వెక్టర్ కంట్రోల్ హైజిన్ యాప్‌లో సమస్యలను తెలియజేయాలన్నారు. ఎన్‌వీబీడీసీపీ కార్యక్రమం నిర్వహణ సక్రమంగా జరిగేందుకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక సూపర్‌వైజర్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించాలని, సబ్ యూనిట్ పరిధిలోని అన్నీ మంచినీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.320

కొండెపి (సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ. 320 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1141 బేళ్ళను తీసుకొని రాగా 985 బేళ్ళు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 156 బేళ్ళ ను తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 320, కనిష్ట ధర రూ. 205, సరాసరి ధర రూ. 251.60 పలకింది. బుధవారం నిర్వహించిన వేలంలో 23 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం

నైరుతీ రుతుపవనాలు జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి..సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని సంకేతాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే వ్యవసాయశాఖ ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేసింది. 1,54,739 హెక్టార్లలో వివిధ రకాల పంటల సాగుకు లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచింది. రూ.18,659 కోట్ల రుణాలు సైతం అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



దుక్కి దున్నుతున్న రైతు

- సాగు ప్రణాళిక ఖరారు
- మొదటి వారంలో రుతు పవనాలు రాక
- వాతావరణం అనుకూలిస్తుందన్న సంకేతాలు
- మరింత సాగుకు రైతన్నకు ప్రోత్సాహం

ఒంగోలు సెంట్రల్: ఈ ఏడాది ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధమైంది. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 1,50,082 హెక్టార్లలో 1,66,596 టన్నుల ఉత్పత్తి సాధన లక్ష్యంగా వ్యవసాయశాఖ ప్రణాళికలు రూపొందించింది. యాక్షన్ ప్లాన్ ఈ విధంగా ఉంది. ఆహార ధాన్యాలు 1,13,402 హెక్టార్లలో 1,32,960 టన్నులు పండించాలన్న లక్ష్యం పెట్టుకుంది. అత్యధికంగా కంది 82154 హెక్టార్లలో, పత్తి 33,000 హెక్టార్లలో, వరి 15100 హెక్టార్లలో సాగు చేయాలని నిర్ణయించింది. అలాగే రైతులకు రూ.2.39 కోట్ల విలువైన 8,893 క్వింటాళ్ల విత్తన ధాన్యాన్ని ఇవ్వనుంది. ఖరీఫ్‌కు మొత్తం 57,647 టన్నుల ఎరువులు అందుబాటులో ఉండగా అందులో 17,168 టన్నులు ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేయనుంది. 810 సీడ్స్, 750 ఎరువులు, 410 పురుగు మందులు డీలర్స్, అవుట్‌లెట్స్, తయారీదారుల నుంచి శాంపిల్స్ సేకరించింది. 38,659 మందికి కౌలుదారుల కార్డులు అందించింది. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు, కౌలుదారులకు కలిపి రూ.18,659 కోట్ల మేర రుణాలు అందించాలని జిల్లా బ్యాంకర్స్ కమిటీ (డీఎల్‌బీసీ) నివేదించినట్లు వ్యవసాయశాఖ జేడీఏ ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. వచ్చేనెల మొదటి వారంలో నైరుతీ రుతు పవనాలు ప్రవేశిస్తుండడం, సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని సంకేతాలు రావడంతో ఖరీఫ్‌లో రైతులకు సహాయ, సహకారాలు అందించాలని డివిజన్ల వారీగా అధికారులు సూచనలు చేసినట్టు చెప్పారు.

ఎరువులు అందుబాటులో ఇలా...

ఖరీఫ్‌కు మొత్తం 57,647 టన్నుల ఎరువులు అందుబాటులో ఉండగా అందులో 17,168 టన్నులు ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేయనున్నారు.

ఎరువు	ఖరీఫ్–24 కేటాయింపు (టన్నుల్లో)
యూరియా	16153
డీఏపీ	7352
ఎంఓపీ	951
ఎస్ఎస్‌పీ	3024
కాంప్లెక్స్	30167
మొత్తం:	57647

ఖరీఫ్‌లో సాధారణ సాగు: 1,50,082 హెక్టార్లు

సాగు లక్ష్యం:	ఉత్పత్తి లక్ష్యం:
1,54,739 హెక్టార్లు	1,66,596 టన్నులు

రుణాల మంజూరు ఇలా..

రుణాల రకం	లక్ష్యం రూ.కోట్లలో
క్రాప్ రుణాలు	13,863
టర్మ్‌లోన్స్ అగ్రి సంబంధిత	4,283
కౌలు రుణాలు	513
	18,659

లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగుతాం

జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 1,50,082 హెక్టార్లు ఉండగా, వాతావరణం అనుకూలిస్తుందన్న సంకేతాలతో ఈ సంవత్సరం 1,54,739 హెక్టార్లలో సాగుకు రైతులను సమాయత్తం చేస్తున్నాం. అందుకు రైతులకు అందించాల్సిన సబ్సిడీ విత్తనాలు, ఎరువులు సైతం సిద్ధం చేశాం.

– ఎస్ శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు

సబ్సిడీ ద్వారా 2024-25 సంవత్సరంలో 8,893 క్వింటాళ్ల సీడ్స్‌ను రూ.2.39 కోట్ల సబ్సిడీతో అందించనున్నారు.

పంట	క్వింటాళ్లలో	సబ్సిడీ (రూ.లక్షలలో)	సబ్సిడీ మొత్తం
వరి	4000	20.00	రూ.క్వింటా 500 చొప్పున
పప్పుధాన్యాలు	2120	88.59	30 శాతం
పచ్చిరొట్ట విత్తనాలు	2773	130.982	50 శాతం
	8893	239.572	

పంటలు	సాధారణ విస్తీర్ణం (హె)	యాక్షన్ ప్లాన్ విస్తీర్ణం (హె)	ఉత్పత్తి కేజీ/హె	ఉత్పత్తి (టన్నులు)
వరి	14078	15100	5290	79879
జొన్న	194	240	2200	528
సజ్జ	7125	7680	2550	19584
మొక్కజొన్న	2464	2464	6000	14784
రాగి	34	34	1600	54
చిరుధాన్యాలు	1388	1600	1300	2080
ముతకధాన్యాలు	11205	12018	37030	14695
కంది	73,003	82154	500	41077
పెసర	1061	1314	800	1051
మినుము	2520	2549	950	2422
ఉలవలు	8	8	700	6
ఇతర పప్పుధాన్యాలు	117	259	800	207
వేరుశనగ	544	544	1850	1006
శనగ	2790	3058	450	1376
ఆముదం	1723	1942	600	1165
ప్రొద్దుతిరుగుడు	161	180	1000	180
సోయాబీన్	21	21	1700	36
పత్తి	31,562	33,000	553	107299
చెరకు	84	90	63750	5738
పొగాకు	0	2500	2650	6625
	1,50,082	154739	285098	166596

విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ

- ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులు పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణత
- ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందజేత
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్:

ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో ప్రమాణాలు మెరుగుపరిచి ఉత్తమ ఫలితాలు సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫలితాలనిస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. మంగళవారం సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హాస్టళ్లలో చదువుతూ పదో తరగతిలో 500 మార్కులపైగా సాధించిన విద్యార్థులను, ఆ దిశగా కృషి చేసి నూరు శాతం ఫలితాలు సాధించిన సంక్షేమ అధికారులను స్పందన భవనంలో కలెక్టర్ సత్కరించి విద్యార్థులకు ప్రతిభ అవార్డులు ప్రదానం చేశారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు అనుగుణంగా జిల్లాలో విద్యార్థులకు వసతితో పాటు సురక్షితమైన వాతావరణంలో మెరుగైన విద్యా బోధన అందేలా చూస్తున్నామన్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలే అందుకు నిదర్శనమన్నారు. జిల్లాకు ఉన్న మానవ వనరులను వినియోగించుకోవడం వలనే మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, టీచర్లు ఇస్తున్న మార్గదర్శకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలు చేరేలా చదువుపై శ్రద్ధ వహించాలన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని హాస్టళ్లలో విద్యార్థులు 89.97 శాతం, బీసీ సంక్షేమ శాఖ హాస్టళ్లలో 93.53 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. పదో తరగతి పరీక్షలకు 650 మంది బీసీ విద్యార్థులు హాజరు కాగా 108 మంది 500పైగా మార్కులు సాధించారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థులు 887 మంది పరీక్షలకు హాజరైతే 76 మంది 500పైగా మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథ రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి అంజల ఇతర అధికారులు పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థులకు ప్రతిభ అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



రూఫ్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అర్జునరావు

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డ్వామా పీడీ అర్జునరావు

యర్రగొండపాలెం: ఉపాధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ బి.అర్జునరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతువారి కుంటలు, ఉద్యాన పంటలపై దృష్టి సారించి గతంలో కంటే ఎక్కువ పనులు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల వద్ద రూఫ్ వాటర్ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, ఒక్కొక్క ఉపాధి కూలీకి రూ.300 తగ్గకుండా వేతనాలు వచ్చేలా కూలీలకు అవగాహన కల్పించి పనులు చేయించాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఫారంపాండ్లు, అమృత్ సరోవర్ కుంటలు, ప్లాంటేషన్ పనులు చేపట్టాలని, ఈ పనులు చేపట్టడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకుంటామని అన్నారు. ముందుగా ఆయన స్థానిక పుల్లలచెరువు రోడ్డులో జరుగుతున్న కందకాల పనులు చేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. అనంతరం మండలంలోని మొగుళ్లపల్లిలో ఫారం పాండ్, ఉద్యాన పంటలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, ఏపీవోలు ఎం.శైలజ, కె.నాగేశ్వరరావు, ఈసీ లక్ష్మానాయక్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత


- లెక్కింపు రోజు ఉదయం 6 గంటలకు అభ్యర్థులు, ఏజెంట్లు చేరుకోవాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఈవీఎంలు భద్రపరిచిన రైజ్ కాలేజీలోనే జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని ఆ ప్రాంతంలో మూడంచెల భద్రత కల్పించి సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. స్పందన భవనంలో మంగళవారం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లకు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌తో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజు ఉదయం 6 గంటలకు తప్పనిసరిగా అభ్యర్థులు, ఏజెంట్‌లు రైజ్ ఇంజినీరింగ్ కాలేజీకి చేరుకోవాలన్నారు. కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే తగిన శిక్షణ ఇచ్చామన్నారు. కౌంటింగ్ ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు సిబ్బందికి, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు, అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్ రూము పక్కనే కౌంటింగ్ హాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అందులో ఆయా అభ్యర్థుల ఏజెంట్లకు ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ హాలులోకి ప్రవేశించేందుకు నియోజకవర్గాల వారీగా అభ్యర్థులకు, ఏజెంట్లకు ప్రత్యేక రంగుల్లో ఉండే గుర్తింపు కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. భద్రతా పరమైన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఉదయం 6 గంటలకే అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూములను ఓపెన్ చేస్తారన్నారు. ఏజెంట్లుగా ఉండే వారు జూన్ 1వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుంటే గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. ప్రత్యేక టీ, భోజన విరామ సమయం లేకుండా నిరంతరం లెక్కింపు ప్రక్రియ కొనసాగేలా చర్యలు తీసుకున్నామన్నారు. పార్కింగ్, భోజన సదుపాయాల కోసం తీసుకున్న చర్యలను వివరించారు.

ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్, భద్రతా పరంగా చేపడుతున్న చర్యలను వివరించారు. ఒంగోలు నుంచి నెల్లూరు వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించి జాతీయ రహదారిపై వన్‌వేలోనే రాకపోకలు సాగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైజ్ కాలేజీకి అర కిలో మీటరు ముందుగానే వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. వెహికల్, ఏజెంట్ పాసులు ఉన్న వారిని మాత్రమే కాలేజీలోకి అనుమతిస్తామన్నారు. తనిఖీలు, బందోబస్తు పరంగా పక్కాగా చర్యలు తీసుకున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రం చుట్టుపక్కల ఎటువంటి బాణసంచా కాల్చడం కానీ, డ్రోన్ ఎగరవేయడం కానీ చేయకూడదన్నారు. కౌంటింగ్ ప్రాంగణంలో బ్రీత్ అనలైజర్ పరీక్షలు జరుపుతామన్నారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, ఈవీఎం ఓట్లు లెక్కించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. దీనిలో పార్లమెంట్ నియోజకవర్గ అధికారి ఝాన్సీలక్ష్మి, డీఆర్‌ఓ శ్రీలత, సంతనూతలపాడు రిటర్నింగ్ అధికారి గోపాలకృష్ణ, మార్కాపురం నియోజకవర్గ ఆర్‌ఓ రాహుల్ మీనా, మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నా రాంబాబు పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పాల్గొన్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



క్లుప్తంగా

ప్రశాంతంగా సప్లమెంటరీ పరీక్షలు

ఒంగోలు: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర, ఆర్ఐఓ ఏ సైమన్‌విక్టర్ తెలిపారు. పదో తరగతి గణితం పరీక్షను 22 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. 2009 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1096 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి గణితం-బి, జువాలజీ, హిస్టరీ పరీక్షలు జరిగాయి. మొదటి సంవత్సరం 43 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించగా 10678 మందికి గాను 10014 మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షను 28 కేంద్రాలలో నిర్వహించగా 2233 మందికిగాను 2015 మంది హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని వారు పేర్కొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం


రామతీర్థం జలాశయంలో తేలాడుతున్న మణికంఠరెడ్డి మృతదేహం

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని రామభద్రాపురం గ్రామానికి చెందిన యాతం మణికంఠరెడ్డి మృతదేహం మంగళవారం లభ్యమైంది. ఈ నెల 26న రామతీర్థం జలాశయంలో ఈతకు వెళ్లి మణికంఠారెడ్డి మునిగిపోయాడు. మూడు రోజులుగా గజఈతగాళ్ల సాయంతో వెతికినా కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు యాతం వెంకటేశ్వరెడ్డి, అనసూర్య, ఇతర కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. మంగళవారం రామతీర్థం జలాశయంలో మృతదేహం పైకి తేలాడడంతో చీమకుర్తి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులు మృతదేహాన్ని ఇంటికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కొడుకు మృతితో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు.

వాలీబాల్ జట్టు శిబిరానికి ఎంపిక


ఎంపికైన బాలికలకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న హెచ్‌ఎం వెంకటేశ్వరరెడ్డి

టంగుటూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ధనుంజయ రావు, ట్రెజరర్ ఆధ్వర్యంలో మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సెలక్షన్లు నిర్వహించారు. ఇందులో పాఠశాలకు చెందిన ఎనిమిది మంది బాలికలు బాపట్ల జిల్లా బోడవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే ఉమ్మడి ప్రకాశం జిల్లా వాలీబాల్ క్యాంపునకు ఎంపికైనట్లు పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వరరెడ్డి రూ. 20 వేల విలువైన క్రీడా సామగ్రిని పాఠశాల పీడీ వెంకట్రావుకు అందజేశారు.

ర్యాష్ రేసింగ్..

పెద్దదోర్నాల-శ్రీశైలం రహదారి బైక్ రేస్‌లకు నిలయంగా మారింది. రాత్రి 9 గంటలు దాటగానే కనీసం లైసెన్సు కూడా లేని మైనర్లు రోడ్డెక్కి రచ్చ రచ్చ చేస్తున్నారు. ఒక్కో బండిపై ముగ్గురు చొప్పున ప్రమాదకరంగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ హడలెత్తిస్తున్నారు. దీంతో ఆ సమయంలో ఆ మార్గంలో ప్రయాణించాలంటే ప్రయాణికులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. గత కొన్ని రోజులుగా ఈ మైనర్ల ఆగడాలు పెచ్చుమీరాయి. ఈ మైనర్ల స్టంట్లతో ప్రమాదాలూ జరుగుతున్న సంఘటనలు లేకపోలేదు.

- నడిరోడ్లపై బైక్‌లతో విన్యాసాలు
- శ్రీశైలం రోడ్డులో రాత్రి 9 దాటితే బైక్‌లతో హల్‌చల్
- ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు
- లైసెన్సు లేని మైనర్ల స్టంట్లు
- పోలీసులు కఠినంగా వ్యవహరిస్తేనే విన్యాసాలకు అడ్డుకట్ట



పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శ్రీశైలం రహదారిలో మైనర్లు బైక్ రైడింగ్‌తో చేసే విన్యాసాలు శృతి మించుతున్నాయి. సాధారణంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి రాత్రి 9 గంటలు దాటితే ప్రయాణం నిషిద్ధం. వన్యప్రాణులు స్వేచ్ఛాయుత వాతావరణంలో సంచరించాలన్న కారణంతో అటవీశాఖ అధికారులు 9 గంటలు దాటితే అన్ని వాహనాలను మండల కేంద్రంలోని గణపతి చెక్ పోస్టు వద్దే నిలిపివేస్తారు. ఈ కారణంతో ఈ రహదారి 9 గంటలు దాటితే నిర్మానుష్యంగా ఉంటుంది. దీంతో కుర్రకారు ఈ రహదారిని వాహనాలు నడిపేందుకు అనువుగా ఎంచుకుని తమ ప్రతాపాన్ని చూపుతున్నారు. రాత్రిళ్లు రయ్ రయ్ అంటూ బైక్‌లను నడుపుతూ పాదచారులను భయాందోళనకు గురిచేస్తున్నారు.

దీంతో రాత్రిళ్లు దుకాణాలు మూసేసిన తర్వాత వాకింగ్‌కు వెళ్లే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి. లైసెన్సు లేని చిన్న చిన్న పిల్లలు సైతం బైక్‌లపై స్టంట్లు చేస్తున్నారు. మరికొంత మంది వాహనాలకు సైలెన్సర్లు తీసేసి పెద్ద పెద్ద శబ్దాలు చేస్తుండటంతో స్థానికులకు ఇక్కట్లు తప్పడం లేదు.

తల్లిదండ్రుల బాధ్యతా రాహిత్యం

చిన్న పిల్లలకు ద్విచక్రవాహనాలకు ఇవ్వకూడదన్న విషయం తల్లిదండ్రులకు తెలిసినా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. బండి నడపటం వస్తే చాలు మనోడే కదా అని కొందరు తల్లిదండ్రులు వాహనాన్ని పిల్లల చేతికి ఇచ్చేస్తున్నారు. ఫలితంగా తాము ప్రమాదాలు కొని తెచ్చుకోవటమే కాకుండా రోడ్డుపై వెళ్తున్న వారి ప్రాణాలకు మీదకు తెస్తున్నారు. లైసెన్సు లేని పిల్లలు రోడ్లపై స్టంట్లు చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మైనర్ల డ్రైవింగ్‌ను అరికట్టేందుకు పోలీసులు మరింత కఠినంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


వేగంగా వాహనాన్ని నడుపుతున్న యువకులు

పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలి..

గతంలో శ్రీశైలం రహదారిలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల వల్ల ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి.

లైసెన్సు లేకుండా వాహనం నడిపితే భారీగా జరిమానాలు విధించాలని స్థానికులు కోరుతున్నారు. శ్రీశైలం రహదారిలో ఈ బైకర్ల విన్యాసాలు అడ్డుకోకుంటే ఎన్నో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. పోలీసులు వీలైనంత తొందరగా ఈ రేసింగ్‌లపై దృష్టి సారించి అడ్డుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వకుండా ఉండేందుకు తల్లిదండ్రులను, వాహన యజమానులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి తల్లిదండ్రులను కౌన్సెలింగ్ సైతం ఇవ్వాల్సిన అవసరం ఉంది

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి


మాట్లాడుతున్న ఏడీ ఉదయభాస్కర్


హాజరైన మధ్యాహ్నం భోజన పతకం కుక్ కం హెల్పర్లు

ఒంగోలు: విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, అందుకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకం కుక్, హెల్పర్లు కృషి చేయాలని విద్యాశాఖ మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయభాస్కర్ అన్నారు. స్థానిక పీవీఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఒంగోలు మండలానికి సంబంధించి కుక్ కం హెల్పర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,85,591 మంది విద్యార్థులు భోజనం చేయాల్సి ఉండగా 1,64,814 మంది భోజనం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో 100 శాతం విద్యార్థులు భోజనం చేయాలంటే రుచికరమైన భోజనం వండాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. భోజన సమయంలో చిన్నారులు పౌష్టికాహారం తీసుకోకుంటే ఏం జరుగుతుందన్న విషయాన్ని ఒక తల్లి లాగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాగి జావ గురించి ప్రత్యేక సూచనలు చేశారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంఈఓ టి.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని పాదయాత్ర

పుల్లలచెరువు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యులు మంగళవారం పుల్లలచెరువు నుంచి శ్రీశైలంకు పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రను రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి సతీమణి అరుణారెడ్డి జెండాను ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా టీంసభ్యుడు చెన్నయ్య మాట్లాడుతూ స్వామి దయతో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తాటిపర్తి చంద్రశేఖర్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని శ్రీశైలం వరకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కందుల వెంకటయ్య, ఉపాధ్యక్షుడు రవణారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ డి. వెంకటేశ్వర్లు, ఎంఎల్‌ఓ వాసు, పీఏసీఎస్ డైరెక్టర్ రఘు, నాయకులు రోసిరెడ్డి, కాశయ్య, ఎల్. ప్రసాద్, యోగిరెడ్డి, నాసర్‌రెడ్డి, వీరారెడ్డి, బంగారురెడ్డి, యలయ్య, మహిళ నాయకురాలు రవణమ్మ, నాగరాజు, టీం సభ్యులు నరసింహారావు, నాగరాజు, నరసయ్య, వెంకటనారాయణ, బ్రహ్మంనాయక్ పాల్గొన్నారు.


పాదయాత్ర చేస్తున్న సోషల్‌మీడియా సభ్యులు

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన చిన్న శంకరయ్య

బేస్తవారిపేట: స్థానిక బీసీ కాలనీకి చెందిన పూసల పాటి చిన్న శంకరయ్య(43) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే..చిన్న శంకరయ్య గత రెండు మూడు నెలలుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అయినా కడుపునొప్పి తగ్గకపోవడంతో మంగళవారం ఉదయం బాత్‌రూంలో పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. శంకరయ్య మృతితో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి

- మరో ఇద్దరి పరిస్థితి విషమం


అనురూప్ మృతదేహం

కనిగిరి రూరల్: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని చాకిరాల సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డ్రైవర్‌గా పని చేస్తున్న గంగవరపు అనురూప్(31) వెలిగండ్ల మండలం మొగుళ్లూరు నుంచి కనిగిరికి బైక్‌పై వస్తున్నాడు. కనిగిరి నుంచి చాకిరాలకు జడ్డు లక్ష్మీ నారాయణ, జడ్డు వెంకటేశ్వర్లులు టీవీఎస్ బైక్‌పై కనిగిరి నుంచి చాకిరాలకు వెళ్తున్నారు. ఈ రెండు బైక్‌లు ఎదురెదురుగా చాకిరాల ఎస్సీ కాలనీ సమీపంలోని బ్రిడ్జి వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జి. అనురూప్, జి.వెంకటేశ్వర్లు, జి.లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వైద్యం కోసం తరలిస్తుండగా.. మార్గమధ్యంలో జి.అనురూప్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఏడాది బాబు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి. త్యాగరాజు తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: రైలులో నుంచి జారిపడి జిల్లాకు చెందిన యువకుడు నిజామాబాద్ జిల్లాలో మృతి చెందాడు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పొదిలి మండలం కంభాలపాడు గ్రామానికి చెందిన రవి(29) నిజామాబాద్‌లో కూలీ పనులు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం రైలులో హైదరాబాద్ వెళ్తుండగా ఇందల్వాయి - సిర్నాపల్లి స్టేషన్ల మధ్యలో ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సత్తా చాటిన వైఎస్సార్ జిల్లా ఎడ్లు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీపేటలో కోదండరామస్వామి తిరునాళ్ల సందర్భంగా మంగళవారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌటపల్లె గ్రామానికి చెందిన ఎడ్లజత ప్రథమస్థానంలో నిలిచింది. పోటీల్లో మొత్తం 8 జతల ఎడ్లు పాల్గొనగా చౌటపల్లె గ్రామానికి చెందిన మార్తాల చంద్ర ఓబుల్‌రెడ్డి ఎడ్లజత నిర్దేశిత సమయంలో 2509 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అదే విధంగా నంద్యాలజిల్లా సిరివెల్ల మండలం గుంపరమానిదిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి ఎడ్ల జత 2381.02 అడుగులతో ద్వితీయస్థానం, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్లజత 2363 అడుగుల లాగి తృతీయస్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచెనపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల జత 2250 అడుగులు, రాచర్ల మండలం జేపీచెరువు గ్రామానికి చెందిన బి.రవితేజ ఎడ్ల జత 1850 అడుగులు, నంద్యాల మండలం కాంతినగర్‌కు చెందిన ఒంగూరి రవిరెడ్డి ఎడ్ల జత 1750 అడుగులు, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి మరో ఎడ్లజత 1500 అడుగులు లాగాయి. ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్లజతకు డాక్టర్స్ ఫార్మసీ ఎండీ తులబందల చలమయ్యనాయుడు సహకారంతో రు.70 వేలు, ద్వితీయ బహుమతిని మితికేల గురవయ్య సహకారంతో రు.50 వేలు, తృతీయ బహుమతి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో రూ.30 వేలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మిగిలిన ఎడ్ల జతలకు ప్రోత్సాహక బహుమతి కింద రూ.10 వేల చొప్పున అందజేశారు. పావలి తిరుపతయ్య, గోదాసు జయరాములు, మితికాల గురవయ్య, తులబందుల చినగురవయ్య, కటకం సత్యనారాయణ, పావలి తిరుపతయ్య, పంచాగ్నుల రామమూర్తిశర్మ, గంజరపల్లి వెంకటేశ్వర్లు, ముత్యాల తిరుపతిరెడ్డి, పావలి శ్రీహరి పాల్గొన్నారు.


డీజీపేటలో ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు, నాయకులు

సంతాపం కూడా చెప్పలేరా..?


స్వాతంత్ర దినోత్సవంలో గోపాలకృష్ణను సన్మానిస్తున్న మంత్రులు, అధికారులు(ఫైల్)

ఒంగోలు టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల నాడు గుర్తుకు వచ్చే స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలు, వారి వారసులు..వారు చనిపోయిన సమయంలో కనీసం సంతాప సందేశాలకు కూడా నోచుకోకపోవడంపై ఒంగోలు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవా సంస్థ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు మనవడు టంగుటూరి గోపాలకృష్ణ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. అయితే ఆయన మృతికి జిల్లా యంత్రాంగం గానీ, జిల్లా సాంస్కృతిక శాఖ, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారులు కనీసం సంతాపం కూడా తెలియజేయలేదని సంస్థ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను, ఆ కుటుంబాలను అవమానించడమేనని వాపోయారు. దీనికి సంబంధించి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను వివరణ కోరగా..హైదరాబాద్‌లోని గోపాలకృష్ణ నివాసానికి అధికారులను పుష్పగుచ్ఛం ఇచ్చి పంపించామని తెలిపారు. సంతాపానికి సంబంధించిన వీడియో కూడా సిద్ధం చేశామని, అయితే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఒత్తిడిలో ఉండటంతో..వీడియో విడుదలలో ఆలస్యమైందని పేర్కొన్నారు. టంగుటూరి గోపాలకృష్ణ మృతి చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. టంగుటూరి ప్రకాశం పంతులు కుటుంబం చేసిన సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు.

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన


కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు అర్బన్: స్థానిక రైజ్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలను, ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కౌంటింగ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేసారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఉండేందుకు ప్రత్యేక బారికేడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కౌంటింగ్ జరిగే సమయంలో భద్రతా చర్యలు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా మూడు అంచెల భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు ఆపల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడిన వ్యక్తులు అరెస్టు


పట్టుబడిన ఉడుములు, వేటగాళ్లను అదుపులోకి తీసుకున్న అటవీశాఖ అధికారులు

గిద్దలూరు రూరల్: వన్యప్రాణులను వేటాడి తీసుకెళ్తున్న నలుగురు వ్యక్తులను అటవీశాఖ అధికారులు మంగళవారం నల్లమల ఘాట్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వంశీక్రిష్ణ తెలిపిన వివరాల ప్రకారం ..దిగువమెట్టతాండా గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు నల్లమల అభయారణ్యం ప్రాంతంలో మూడు ఉడుములను వేటాడి ఓ సంచిలో వేసుకుని రోడ్డులో ఉన్నారు. వారిని తీసుకువచ్చేందుకు గిద్దలూరు నుంచి కారు వెళ్లింది. అందులో ఎక్కిన నలుగురు గిద్దలూరు వైపుగా వస్తున్న సమయంలో తన సిబ్బంది సహాయంతో వారిని అదుపులోనికి తీసుకున్నారు. అటవీశాఖ అధికారులను గమనించిన నలుగురిలో ఒకరు పారిపోయాడు. దీంతో కారు డ్రైవర్‌తో పాటుగా ముగ్గురు వేటగాళ్లను వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, కారు, గొడ్డలి, ఉడుములను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వంశీకృష్ణ తెలిపారు. పారిపోయిన వ్యక్తిని పట్టుకుంటామన్నారు. వన్యప్రాణులను వేటాడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఉపాధ్యాయుడి ఇంటిపై పెట్రోల్ బాంబుతో దాడి


పామూరు సీఐకి ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయుడు నారాయణ

వెలిగండ్ల: మండలంలోని జంగంనరసాయపల్లిలో ఉపాధ్యాయుని ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబుతో దాడికి యత్నించారు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో జరిగింది. ఎస్సై ఎం శివ తెలిపిన వివరాల ప్రకారం...జంగం నరసాయపల్లికి చెందిన ఉపాధ్యాయుడు తీట్ల నారాయణ ఇంట్లో నిద్రిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు బీరు సీసాల్లో పెట్రోల్ పోసి గుడ్డ చుట్టి నిప్పంటించి ఉపాధ్యాయుని ఇంటిపై విసిరేశారు. పెట్రోల్ నింపిన బీరు బాటిళ్లు ఇంటి గేటుకు తగిలి కిందపడి పేలింది. పెద్ద శబ్దం రావడంతో నారాయణ బయటకు రాగా..ఆవరణలో పెట్రోల్ నింపిన బీరు బాటిళ్లు పగిలి ఉన్నాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం శివ తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ రత్నాకరం రామరాజు, సీఐ రామానాయక్, ఎస్సై ఎం శివ సందర్శించారు. అనంతరం క్లూస్‌టీంను పిలిపించి తనిఖీలు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

PARAMEDICAL

■ ప్రభుత్వ పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు DMLT, Ophthalmic, Radio graphic, Medical Imaging, Anesthesia, Cardiology, OT Technician, Dialysis, Optometry ECG, Cathlab, Health Assistant, విద్యార్హత : ఇంటర్ ఎనీ గ్రూప్ స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజి ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225 [OA-236]

Services

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్స్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9253560455. [T-1262254]

Wanted

■ ఒంగోలులో MSK గ్రూప్ నందు పనిచేయుటకు సెక్యూరిటీగార్డులు అర్జంట్‌గా కావలెను. నాన్‌లోకల్ వారికి రూమ్‌ఫ్రీ. ✆ 76609 19584, 74164 66856 [O-189951]

■ ITIF లి॥ సంస్థ ఒంగోలులో నూతన బ్రాంచికి F.Oలు (ఫీల్డ్ ఆఫీసర్లు) కావలెను. జీ॥17 k to 18 k & 3500/-పెట్రోల్ బిల్ + ఇన్సెంటివ్స్. Exp గల వారికి CTC బట్టి జీతం+ 3500/- పెట్రోల్ బిల్+ఇన్సెంటివ్స్. జాబ్ లోకేషన్ ఒంగోలు. వర్క్ : Used కార్స్, కమర్షియల్ మెహికల్స్ & ట్రాక్టర్‌కి ఫైనాన్స్. Q: ఇంటర్ or డిగ్రీ సంప్ర॥ ✆ 93988 51991, 99083 99178. [O-189966]

■ 6th to10th అన్నీ సబ్జెక్ట్స్ బోధించుటకు మరియు 4th to 7th ఇంగ్లీషు, హిందీ, సైన్స్ సబ్జెక్ట్స్‌కు టీచర్స్ కావలెను. శ్రీ ABC హై స్కూల్, తాళ్ళూరు. ✆ 99488 48374, 97053 47580, 98488 26720. [O-189968]

■ నెలకు శాలరి 30K. రియల్ ఎస్టేట్‌లో ప్లాట్లు అమ్మకం ఇంత ఈజీనా అనే నూతన విధానం. ఉన్నత స్థాయికి ఎదగాలి అనుకునే వారు. ✆ 91820 70657, 70135 82953 [B-086]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్‌టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500రూ. మీ పేరు, అడ్రస్, కాల్/వాట్సప్ చేయగలరు. 9502615217 [G-8898]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1233988]

■ Secur Security Services టంగుటూరు పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీ SO లు మరియు ASO లు మరియు సెక్యూరిటీ గార్డ్స్, లేడీ గార్డ్స్ కావలెను. 99595 98279. [NA-23454]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024 / 9640400073 [HA-167]

■ Wanted Telugu, Maths, English, Computer Teachers from 4th to 10th Classes and Computer Operator. Sri Gayatri Grammar School, Samatha Nagar, Ongole. ✆ 90144 04155. [OA-238]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.